కథ

# దొంగ

గుండాన జోగారావు

టిట్లాఘర్ నుండి వస్తోన్న తమిళనాడు ఎలక్ట్రిసిటీబోర్డు క్రాక్ గూడ్స్ ట్రైన్ రాయగడ స్టేషన్లో ఆగింది. బొగ్గుబండి. నేను గూడ్స్ గార్డ్ని.

ఇంజన్లకు ఆయిల్ కావాలి. ఫ్యూయలింగ్ జరుగుతోంది. ఈలోగా నేను ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై ఉన్న బుక్ స్టాల్ కెళ్ళి 'సాక్షి' పేపర్ తీసుకుని బ్రిడ్జిమీదుగా రెండో నెంబరు ప్లాట్‌ఫాంపై ఆగివున్న గూడ్స్ బ్రేక్‌వ్యాన్ వైపు సాగిపోతున్నాను.

దారిలో కన్పించాయి ఐదు బొగ్గుబస్తాలు.... మా చెడ్డకోపం వచ్చింది. దొంగలు... దొంగతనం.... చుట్టూ చూశాను.... ఎవరూ కనిపించలేదు. తలెత్తి చూస్తే వ్యాగనుకున్న మెట్లెక్కి బొగ్గులు క్రిందపడేస్తున్న ముసల్ది కనిపించింది. వయసు ఆరుపదులు దాటినా చలాకీగా తనపని తాను చేసుకుపోతోంది.....

"ఏయ్... నిన్నే.... దిగు..." అని కేకేశాను. నన్ను చూసి భయంతో గబగబా దిగి తలదించుకు నిల్చుంది.

"సిగ్గులేదూ.... ఈ వయసులో ఇంకా దొంగతనం చేస్తున్నావ్"

ఉలుకూ పలుకూ లేదు.

"పోలీసులకు పిలిచి అప్పజెప్పనా?" అన్నాను కన్నెర్రజేస్తూ.

బోసినవ్వు నవ్వింది ముసల్ది. నాకు ఒళ్ళు మండింది.

"పోలీసులంటే భయం లేదా?" ప్రశ్నించాను.

"వాళ్ళే పంపించారు బాబూ"

"అదేంటీ"

"బొగ్గుబండి వస్తోంది..... లైన్‌క్లియర్ అయిందని కబురు పంపింది వారే"

"ఆశ్చర్యంగా ఉందే"

"ఇది మామూలే బాబూ.... బస్తాకి పాతిక చొప్పున ఇచ్చేయడమే॥

"ఎంతకి అమ్ముతావు బస్తా?"

"యాభై"

"నీకెంత మిగుల్తుంది?"

"ఖర్చులు పోనూ వంద... ఆ డబ్బుల్తో జిమిడిపేట వెళ్ళాలి.... మనవడికి తావీదు కట్టించాలి"

"ఎందుకు?"

"వాడికి రోజు విడిచి రోజు జ్వరం వస్తోంది బాబూ.... ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోయింది... ఓ ఫకీరు చెప్పాడు జిమిడిపేట వెళ్ళమని..."

"నీ కొడుకేం చేస్తున్నాడు?"

"వాడు తాగుడికి బలైపోయాడు బాబూ.... కోడలు పచ్చకామెర్లతో చచ్చిపోయింది... మనవణ్ణి చేతిలోపెట్టి..."

"ఏడీ నీ మనవడు?"

"అదిగో.... సిమ్మెంట్ దిమ్మపై నిద్దరపోతున్నాడు..... నాకు మిగిలిన ఏకైక తోడు వాడేబాబూ"

ఇంతలో డ్రైవర్ వాకీటాకీలో కేకేశాడు..... "రావ్ దాదా... ఫ్యుయలింగ్ కంప్లీట్... స్టార్టర్స్ ఇచ్చారు"

"ఓ.కే. రైట్..... రైట్.... ప్రొసీడ్"

ముసల్దాన్ని మరిచిపోయినట్టే. డ్రైవర్‌తో సిగ్నల్ ఎక్స్ఛేంజ్ చేయిస్తున్నాను.

ఏం గ్రహించిందో ఏమో, బస్తా తలపై పెట్టుకుని నిశ్చింతగా సాగిపోతోంది ముసల్ది. ఆమె పోకడలో భయం, భీతి ఏమీ లేవు... మనవడిని కాపాడుకోవాలన్న తపన తప్ప!





240 పేజీలు
వెల :
రు॥ 150 /- లు

నండూరి రాజగోపాల్

"అనంతరంగాలు"

సాహిత్య పరామర్శ

23-11-2008 న విజయవాడలో ఆవిష్కరణ జరిగింది.

ఈ పుస్తకం కావలసినవారు రు॥ 100/-లు ఎం.ఓ.ద్వారా పంపించగలరు. పోస్టేజి ఉచితం.

మేనేజర్, చినుకు ప్రచురణలు, దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 520 003. ✆ 0866-6640595, సెల్ : 98481 32208